క్లుప్తంగా

నేడు సీసీ కెమెరాల ప్రారంభం

ముషీరాబాద్: సెంట్రల్ జోన్ పరిధిలోని చిక్కడపల్లి డివిజన్ మూడు పోలీస్‌స్టేషన్‌ల ప్రాంతాల్లో దాతల సహకారంతో సీసీ కెమెరాలను హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీ.వీ.ఆనంద్ త్యాగరాయ గాన సభలో ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ఆర్థిక సహకారం అందజేసిన 9 మంది దాతలను నగర పోలీస్ కమిషనర్ సన్మానించనున్నారు. జాయింట్ కమిషనర్, సెంట్రల్ జోన్ డీసీపీ, చిక్కడపల్లి ఏసీపీ, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొంటారు.

ఆకట్టుకున్న భక్తి గీతాలు



నల్లకుంట: శ్రీరామ నవమి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శ్రీ సాయి శృతి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో సుదర్శన లక్ష్మణ సమేత సీతారామచంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో భక్తి గీతాలాపన నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం అకాడమీ ప్రిన్సిపాల్ గౌరీభట్ల లక్ష్మణమూర్తి శిష్య బృందం ఆలపించిన భక్తి గీతాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. అకాడమీ డైరెక్టర్ వసుధామూర్తి, గాయకులు నందిని, యామిని పాల్గొన్నారు.

చిరుధాన్యాలతోనే ఆరోగ్యం



దోమలగూడ బండానగర్‌లో పోషణ్ అభియాన్ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు

కవాడిగూడ: మహిళలు, చిన్నారులు రోజూ తీసుకునే ఆహారంలో చిరుధాన్యాలు తీసుకుంటే ఆరోగ్యపరంగా అధిక లాభాలు చేకూరుతాయని ముషీరాబాద్, హిమాయత్‌నగర్ సెక్టార్‌ల సూపర్‌వైజర్లు జ్యోతి, ఉమాలు పేర్కొన్నారు. మంగళవారం కవాడిగూడ డివిజన్‌లోని అంగన్‌వాడీ సెంటర్ల ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పోషణపక్షం కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులు చిరుధాన్యాలు తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వారు వివరించారు.

- మార్చి 20 నుంచి ఏప్రిల్ 3 వరకు నిర్వహిస్తున్న పోషణ అభియాన్ కార్యక్రమాన్ని ప్రతి అంగన్‌వాడీ సెంటర్లలో నిర్వహించి పిల్లలు, తల్లిదండ్రులకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పిల్లలు, తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయించారు.
- విద్యార్థులకు పోషణ అభియాన్‌పై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. అంగన్‌వాడీ టీచర్లు భాగ్యరేఖ, పద్మబాయి, ఉమాదేవి, ప్రమీల, జ్యోతి, అలివేలుమంగ, పుష్పలీలా, సరిత, లక్ష్మీనర్సమ్మ, సుజాత, రేణుక, అప్సా కో–ఆర్డినేటర్ బొట్టు రమేష్, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న రాణి పద్మావతి నాటకం

చిక్కడపల్లి: జావాసి 16వ శతాబ్దంలో రచించిన పద్మావతి కావ్యాన్ని హిందీ బాషలో రాణి పద్మావతి నాటకీకరణ చేసి రంగస్థల ప్రముఖులు ప్రొఫెసర్ ప్రదీప్‌కుమార్ అద్భుతంగా నటించి సభికులను ఆకట్టుకున్నారు. ప్రదీప్ ఫిల్మ్ అండ్ టీవీ ఫర్ పర్ఫార్మింగ్ ఆర్ట్స్ ఇన్‌స్టిట్యూట్ నిర్వహణలో రీసెర్చ్ ఫౌండేషన్ ఫర్ డివోషనల్ స్టడీస్ రీసెర్చ్ ఫౌండేషన్, సిటీకాలేజ్ సౌజన్యంతో మంగళవారం రాత్రి త్యాగరాయ గానసభలో ప్రదర్శించారు. పద్మావతిగా ప్రొఫెసర్ హెచ్.కె.వందన తన నటనతో ఆకట్టుకున్నారు. రతన్‌సింగ్‌గా అల్లావుద్దీన్‌గా ప్రదీప్‌కుమార్ అద్భుతమైన స్వరంతో ఆకట్టుకున్నారు. కె.యామిని, వరలక్ష్మి, నిఖిత, కల్యాణి, శిల్ప, సిటీ కాలేజీ విద్యార్థులు నాటకంలో నటించడంతో పాటు హిందుస్థానీ నృత్యాన్ని ప్రదర్శించారు.

పార్కులో విరిగిపడిన చెట్టు కొమ్మలు !



చిక్కడపల్లి: చిక్కడపల్లి వివేక్‌నగర్ పీపుల్స్ పార్క్‌లో తెల్లవారు జామున చెట్టుకొమ్మలు విరిగి పడ్డాయి. మంగళవారం ఉదయం ఒక్కసారిగా శబ్దం రావడంతో స్థానికులు బయటకువచ్చి విషయాన్ని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్‌కు తెలిపారు. ఆమె ఎమర్జెన్సీ డీఆర్‌ఎఫ్ సిబ్బందిని రప్పించి చెట్టు కొమ్మలను తొలగింపజేశారు. కార్పొరేటర్ సూచనల మేరకు నగర బీజేపీ నేత వినయ్ కుమార్ పార్కుకు చేరుకుని పనులు పూర్తి చేయించారు. బీజేపీ నాయకులు నర్సింగ్‌రావు, నీరజ్, ఆకుల అభిషేక్ తదితరులు పాల్గొన్నారు. అరగంటలోనే సిబ్బంది సమస్యను పరిష్కరించడంతో వివేక్‌నగర్ పీపుల్స్ రెసిడెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు గంగరాజు, శివకుమార్, ప్రేమ్‌కుమార్, రజనీకాంత్ తదితరులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

అనైతిక వైద్యంతో దోపిడీ



- నిబంధనలకు విరుద్ధంగా అబార్షన్లు చేస్తున్న కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌లు
- నియోజకవర్గంలో విచ్చలవిడిగా దందా
- వైద్యంపై కనీస పరిజ్ఞానం, అర్హత లేని డాక్టర్లు
- ఇటీవల వెలుగులోకి వచ్చిన ఘటనల్లో అరెస్టైన వైనం

అంబర్‌పేట: నియోజకవర్గంలో కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు, గల్లీల్లో కొన్ని చిన్న క్లినిక్‌లు అక్రమాలకు పాల్పడుతూ సామాన్యుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చట్ట విరుద్ధంగా వైద్యం అందించి అక్రమాలకు పాల్పడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

పట్టించుకోని సంబంధిత అధికారులు..

- ఇలాంటి విషయాలపై ఉక్కుపాదం మోపాల్సిన వైద్య ఆరోగ్య శాఖ చోద్యం చూస్తోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీస తనిఖీలు లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శిస్తున్నారు. నిబంధనలు పాటించని ప్రైవేటు క్లినిక్‌లు, ఆస్పత్రులపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

జైలుకు కూడా వెళ్లొచ్చి ..

- ఇటీవల అంబర్‌పేట డివిజన్ చెన్నారెడ్డినగర్‌లోని ఓ ఆస్పత్రి వైద్యుడు మైనర్ బాలికకు నిబంధనలకు విరుద్ధంగా అబార్షన్ చేసి జైలుకు వెళ్లడం చర్చనీయాంశమైంది. డబ్బులకు కక్కుర్తిపడి బాలిక ప్రియుడి మాటలు నమ్మి అబర్షన్ చేయడంతో బాలిక తల్లిదండ్రులకు విషయం తెలిసింది. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు నిందితులైన ప్రియుడు, అబర్షన్ చేసిన వైద్యులు మల్లికార్జున్, రమేష్‌లపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ విషయం వెలుగులోకి రావడంతో ప్రైవేటు ఆస్పత్రుల అసలు విషయం బయటపడింది.

వెలుగులోకి రానివెన్నో..

- గుట్టు చప్పుడు కాకుండా బెదిరించి, ఇతరత్రా పలుకుబడులతో వెలుగులోకి రాని కేసులు పెద్ద ఎత్తున ఉన్నట్లు పలువురు అభిప్రాయపడుతున్నారు. గత నెల రోజుల క్రితం 6 నంబరు చౌరస్తాలోని ఓ క్లినిక్‌లో సైతం ఓ దళిత అమ్మాయికి అబర్షన్ గుట్టు చప్పుడు కాకుండా నిర్వహించినట్లు విశ్వసనీయ సమాచారం.

వివాహం కాకుండా గర్భం దాల్చిన వారే..

- వివాహం కాకుండానే గర్భం దాల్చిన యువతుల బలహీనతలను ఆసరాగా చేసుకుని ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌లు భారీ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తూ.. అనైతిక వైద్యానికి పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కనీస పరిజ్ఞానం లేని వైద్యం..

- ఆర్‌ఎంపీ పేరిట అందిస్తున్న వైద్యంతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యాధి ఒకటైతే వైద్యం మరొకటి చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ప్రైవేటు డయగ్నొస్టిక్ సెంటర్లలతో కమీషన్లను కుదుర్చుకుని టెస్టులు రాస్తూ.. సొమ్ము చేసుకుంటున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇష్టానుసారంగా వసూళ్లు..

- చిన్నపాటి జ్వరానికే ఆసుపత్రులు, క్లినిక్‌లలో చేర్చుకుని అందినకాడికి దోచుకుంటున్నారని పలువురు అభిప్రాయ పడుతున్నారు. నియోజకవర్గంలో సుమారు 50కి పైగా క్లినిక్‌లు ఉన్నట్లు వైద్య ఆరోగ్య శాఖ గుర్తించినా కనీస చర్యలు తీసుకోవడం లేదని మండిపడుతున్నారు. నకిలీ వైద్యంతో రోగుల ప్రాణాల మీదుకు తీసుకొస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ఆస్పత్రులపై చర్యలు తీసుకుంటాం. నిర్దిష్టమైన ఫిర్యాదులు వస్తే శాఖాపరమైన చర్యలు తీసుకునేందుకు వెనుకడుగు వేయం. తమ పరిధిలోని ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌లను తనిఖీలు చేస్తాం. సామాన్యులకు ఏలాంటి ఇబ్బందులున్నా తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తాం.

–హేమలత, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

ఇంటింటికీ శోభాయాత్ర కరపత్రాల పంపిణీ



కరపత్రాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ అమృత

నల్లకుంట: బీజేపీ జోగులాంబ గద్వాల జిల్లా ఇన్‌చార్జ్ వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 30న అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న శ్రీరామనవమి శోభయాత్రలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని నల్లకుంట కార్పొరేటర్ వై. అమృత కోరారు. మంగళవారం నల్లకుంట నర్సింహ బస్తీలోని పోచమ్మ ఆలయ పరిసరాల్లో ఇంటింటికీ వెళ్లిన కార్పొరేటర్ శోభాయాత్ర కరపత్రాలను పంపిణీ చేశారు. బీజేపీ మహిళా మోర్చా నాయకులు జ్యోతి, వరలక్ష్మి తదితరులున్నారు.

కాచిగూడ: శ్రీరామనవమి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఈ నెల 30న అంబర్‌పేట మున్సిపల్ మైదానం నుంచి రాంకోఠి హనుమాన్ వ్యాయామశాల వరకు నిర్వహించే శ్రీరామనవమి శోభాయాత్రను జయప్రదం చేయాలని శోభాయాత్ర అంబర్‌పేట నియోజకవర్గ కన్వీనర్ వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం బీజేపీ జాతీయ నాయకులు కేసరి నర్సింగ్‌యాదవ్ ఆధ్వర్యంలో గోల్నాక డివిజన్ కామ్‌గార్‌నగర్‌లో ఇంటింటికీ తిరుగుతూ శోభాయాత్ర ఆహ్వాన పత్రికను అందజేశారు. బీజేపీ నేతలు కృష్ణంరాజు, ఆర్‌వీఎల్ రమేష్, లక్ష్మీనారాయణ, నర్సింగ్‌రావు, విష్ణు, బస్తీ వాసులు పాల్గొన్నారు.

కాచిగూడలో..

కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో శ్రీరామనవమి శోభాయాత్రను విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం డివిజన్‌లోని చెప్పల్‌బజార్, ఇందిరానగర్, మోతిమార్కెట్, జమాల్‌బస్తీ, నింబోలిఅడ్డ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. బీజేపీనేతలు శిర్‌సాగర్, సుభాష్ పటేల్, అరవింద్, మల్లికార్జున్, సునిల్, రవియాదవ్ తదితరులున్నారు.

ఫోన్లకు దూరంగా పుస్తకాలకు దగ్గరగా ఉండాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: వార్షిక పరీక్షలు సమీపిస్తున్న వేళ విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా.. పాఠ్య పుస్తకాలకు దగ్గరగా ఉండాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. మంగళవారం అంబర్‌పేట మండల పాఠశాలల అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే విద్యార్థులను ప్రోత్సహించి ప్రసంగించారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితేనే ఉన్నత ఫలితాలను సాధించవచ్చన్నారు. గంప నాగేశ్వర్‌రావు, కార్పొరేటర్ విజయ్‌కుమార్, రవి, మధుసూదన్, చంద్రమోహన్, నిరంజన్, శ్రీనివాస్‌రెడ్డి, షఫీ, బీమేష్, గడ్డం సాయికిరణ్, రంగాచారి, ప్రసాద్, కావ్య, రాజగోపాల్, అనిల్‌గౌడ్, సంతోష్‌చారి తదితరులున్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



సినీ హీరో ఆనంద్ దేవరకొండ, హీరోయిన్ వైష్ణవి చైతన్య తదితరులు

కాచిగూడ: విద్యార్థులు పూర్తిగా అధ్యాపకులు, పాఠ్యపుస్తకాలపైనే ఆధారపడకుండా సొంత పరిజ్ఞానంతో నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ప్రముఖ సినీ నటుడు ఆనంద్ దేవరకొండ అన్నారు. రాజా బహదూర్ వెంకటరామారెడ్డి మహిళా కళాశాల బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం డైరెక్టర్ డాక్టర్ రేణుక సాగర్ ఆధ్వర్యంలో మంగళవారం నారాయణగూడలోని కళాశాల ఆడిటోరియంలో 'మేనేజ్‌మెంట్ ఫెస్ట్' జరిగింది. ఆయన మాట్లాడుతూ.. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా విద్యను అభ్యసించాలన్నారు. మేనేజ్‌మెంట్ విద్యార్థులు సృజనాత్మకతను ఉపయోగించి నూతన ఆవిష్కరణలతో అన్ని రంగాల్లో అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

- బిజినెస్ క్విజ్, యంగ్ మేనేజర్, యాడ్ మేకింగ్, డాన్స్ కాంపిటీషన్, తంబోలా తదితర పోటీలను నిర్వహించారు. విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. హీరోయిన్ వైష్ణవి చైతన్య, ప్రిన్సిపాల్ డాక్టర్ అచ్యుతదేవి, కల్పన రమేష్, మాధవి దేవరకొండ, డాక్టర్ రేణుకా సాగర్, డాక్టర్ కవిత తదితరులున్నారు.

సీపీఎం జనచైతన్య యాత్ర



బైక్‌ర్యాలీలో సీపీఎం నాయకులు

కవాడిగూడ: రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలను మోసం చేస్తోందని సీపీఎం ముషీరాబాద్ నియోజకవర్గ కార్యదర్శి ఎం.దశరథ్ ఆరోపించారు. మంగళవారం ముషీరాబాద్ నియోజకవర్గంలోని కవాడిగూడ, భోలక్‌పూర్, గాంధీనగర్, రాంనగర్, అడిక్‌మెట్ డివిజన్‌లలో ఆ పార్టీ నిర్వహిస్తున్న జనచైతన్య యాత్రలో భాగంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం దశరథ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయడం బీజేపీకే చెల్లుబాటు అవుతోందన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు గ్యాస్, పెట్రోల్ ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండేవని ప్రస్తుతం ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరుస్తుందని ఆరోపించారు. ప్రశ్నించే నాయకులపై సామాజిక సంఘాలపైన అక్రమంగా కేసులు నమోదు చేసి జైలులో నిర్బంధిస్తున్నారన్నారు. జనచైతన్య యాత్ర ముగింపు సందర్భంగా బుధవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో నిర్వహించే మహాధర్నాకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సీపీఎం నాయకులు వెంకటేష్, మారన్న, శ్రీరాములు, బాబు, విమల, రమేష్, పాషా, నర్సింగ్‌రావు, ఎల్లయ్య, సైదులు, కృష్ణస్వామి తదితరులున్నారు.

నాలా రిటైనింగ్ వాల్ నిర్మాణ పనుల పరిశీలన

నల్లకుంట: నల్లకుంట డివిజన్ పరిధిలోని శివానంద్ నగర్‌కు సమీపంలో ఉన్న హుస్సేన్‌సాగర్ నాలా రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్. గౌతంరావు, స్థానిక కార్పొరేటర్ అమృత, మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. రిటైనింగ్ వాల్ నిర్మాణానికి కొందరు తమ ఇళ్లను స్వచ్ఛందంగా అప్పగించారని మరి కొందరు అడ్డుకునే ప్రయత్నం చేశారన్నారు. ప్రస్తుతం కూల్చివేసిన ఇళ్ల శిథిలాలను చదును చేయించాలని అధికారులు కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఎలాంటి ఘర్షణలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మున్సిపల్ అధికారులు అరుణకుమారి, వరప్రసాద్, స్థానిక బస్తీవాసులు పాల్గొన్నారు.

ఉగాది పురస్కారాల ప్రదానం



ఉగాది పురస్కారాలను ప్రదానం చేస్తున్న అతిథులు

చిక్కడపల్లి: ఉగాది అంటే పచ్చడి పంచాగంతో పాటు కవిత్వం కూడా ప్రాధాన్యత వహిస్తాయని పులువురు కవులు పేర్కొన్నారు. మంగళవారం త్యాగరాయ గానసభ కళాదీక్షితులు కళావేదికలో ఉగాది కవి సమ్మేళనం జరిగింది. ప్రముఖ కవులు శరత్‌జ్యోత్స్నరాణి, వడ్డేపల్లి కృష్ణలు మాట్లాడుతూ.. కవిత్వం రాసేవారు ముఖ్యంగా మహిళల సంఖ్య పెరుగుతోందని ఇది శుభసూచకం అన్నారు. వివిధ రంగాల్లో పేరు గడించిన వారికి ఉగాది పురస్కారాలను ప్రదానం చేశారు. మధునాపంతుల సత్యనారాయణమూర్తి, పోతుకూచి భీమబట్లేశ్వరరావు, విల్సన్, మల్లెపూల వెంకటరమణ, సుధ, రమ్య, రవిమన్యు తదితరులు పురస్కారాలను అందుకున్నారు. వేలూరు రామకృష్ణారావు బృందం సినీగీతాలు పాడి ఆకట్టుకున్నారు.

ఆర్థిక సాయం అందజేత

చిక్కడపల్లి: అశోక్‌నగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న కొమురయ్య కుమార్తె రక్షిత ఇంటర్మీడియట్ చదువుతోంది. ఆమె కళాశాల ఫీజు నిమిత్తం లయన్స్‌క్లబ్ ప్రతినిధులు ఆర్థిక సాయం అందజేశారు. మంగళవారం నవభారత్ లయన్స్ క్లబ్ ప్రతినిధి హిప్నోపద్మకమలాకర్ ఆధ్వర్యంలో రూ.10 వేల చెక్కును ఉపాధ్యక్షులు వినయ్ ఇవ్వగా.. డిస్ట్రిక్ట్ గవర్నర్ జూలూరు రఘు, స్వరూపరాణి, కృష్ణవేణి అందజేశారు.

ఆంజనేయ స్వామి ఆలయంలో చండీహోమం



చిక్కడపల్లి: చిక్కడపల్లి వివేక్‌నగర్ ఆంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా చండీయాగం నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం స్థాపిత దేవతాహోమం, హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ జరిగింది. ఆలయ చైర్మన్, ఈఓ మురళీప్రసాద్, దేవనాథం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పండుగలు శాంతియుతంగా నిర్వహించుకోవాలి

నల్లకుంట: పండుగలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని నల్లకుంట సీఐ మొగిలిచర్ల రవి ప్రజలకు సూచించారు. శ్రీరామ నవమి, హనుమాన్ జయంతి, రంజాన్ పండుగల సందర్భంగా నల్లకుంట పోలీస్ స్టేషన్‌లో శాంతి సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. మత సామరస్యం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని సూచించారు. నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రాంతాలు మత సామరస్యానికి ప్రతీకగా ఉన్నాయని అన్ని మతాలు, కులాల వారు సోదర భావంతో మెలగడం మన సంప్రదాయమన్నారు. పండుగలు ప్రశాంతంగా జరిగేలా పీస్ కమిటీ సభ్యులు పోలీసులను నియమిస్తామని వారు సహకరించాలని కోరారు. ఎస్సైలు శివశంకర్, కె.రమాదేవి, కాశయ్య, శాంతి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ మొగిలిచర్ల రవి

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా.. ?



మాట్లాడుతున్న కార్పొరేటర్ కె.రవిచారి

ముషీరాబాద్: నియోజకవర్గంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్ నాలుగేళ్లలో చేసిన అభివృద్ధిపై చర్చకు రావాలని జీహెచ్ఎంసీ బీజేపీ ఫ్లోర్ సెక్రటరీ, రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ కె.రవిచారి సవాల్ విసిరారు. మంగళవారం రాంనగర్‌లోని కార్పొరేటర్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ముషీరాబాద్ నియోజకవర్గంలో తనకంటే ఎక్కువ అభివృద్ధిని ఎవరూ చేయలేరని అలా చేసినట్లు నిరూపిస్తే భవిష్యత్తులో పోటీ కూడా చేయనని ఎమ్మెల్యే సోమవారం జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ విషయంపై ఎమ్మెల్యే బహిరంగ చర్చకు రావాలని లేదంటే రాజీనామా చేయాలని కార్పొరేటర్ డిమాండ్ చేశారు.

- నియోజకవర్గంలోని రాంనగర్, అడిక్‌మెట్, గాంధీనగర్, కవాడిగూడ, ముషీరాబాద్ తదితర డివిజన్‌లలో ఎక్కడి సమస్యలు అక్కడే రాజ్యమేలుతున్నాయన్నారు.
- డ్రైనేజీ, కలుషిత నీరు, దెబ్బతిన్న మ్యాన్‌హోల్స్, అధ్వానంగా మారిన రోడ్లు, వెలగని వీధి దీపాల వంటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు.
- ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను విస్మరించారని అర్హులకు పింఛన్‌లు మంజూరు కావడం లేదని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు దరఖాస్తు చేసుకున్న వారికి ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు.
- ఇందిరాపార్కులో ప్రజలకు స్విమ్మింగ్ పూల్ కట్టిస్తానని ఇప్పటి వరకు కట్టించలేదని హైటెన్షన్ వైర్లను పూర్తిగా తొలగించి అండర్‌గ్రౌండ్ కేబుల్ ఇస్తామని ఎమ్మెల్యే చెప్పారన్నారు.
- నియోజకవర్గ అభివృద్ధికి రూ.1000 కోట్ల నిధులను ఎక్కడ ఖర్చు చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.
- వివిధ శాఖల అధికారులతో పనులు చేయించడంలో పూర్తిగా విఫలం చెందారని ఆసరా పింఛన్ కార్డులను తహసీల్దార్ కార్యాలయం నుంచి తీసుకొచ్చి బీఆర్‌ఎస్ నేతల ఇళ్లల్లో పెట్టారని విమర్శించారు.
- పింఛన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేయకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. కొత్త రేషన్ కార్డు, కొత్త పింఛన్లు లేవని విమర్శించారు. ఎమ్మెల్యే తన మాటకు కట్టుబడి బహిరంగ చర్చకు సిద్ధం కావాలని కోరారు.

'రాహుల్ గాంధీపై అనర్హత వేటు అప్రజాస్వామికం'



దీక్షలో ప్రసంగిస్తున్న అంజన్‌కుమార్‌యాదవ్

ముషీరాబాద్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై ఎంపీ అనర్హత వేటు అప్రజాస్వామికమని ఆలిండియా కాంగ్రెస్ పిషర్‌మెన్ కమిటీ కార్యదర్శి బిజ్జి శత్రు అన్నారు. మంగళవారం ముషీరాబాద్ కాంగ్రెస్ బీసీసెల్ కార్యదర్శి రాము ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీపై ఎంపీ అనర్హత వేటు వేయడాన్ని నిరసిస్తూ.. పార్సిగుట్ట చౌరస్తాలో కాంగ్రెస్ సంకల్ప సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా హాజరైన బిజ్జి శత్రు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. 'ప్రతిపక్ష నాయకులపై ప్రధాని మోదీ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని' విమర్శించారు. కాంగ్రెస్ సేవాదళ్ గ్రేటర్ అధ్యక్షులు సురేష్, ముషీరాబాద్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు విజయ్‌కుమార్ యాదవ్, వల్లభరెడ్డి, చక్రధర్, బాల్‌రాజ్ తదితరులున్నారు.

ఆదరణ చూసి ఓర్వలేకే..

చిక్కడపల్లి: కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకే పార్లమెంట్ సభ్యత్వాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందని టీపీసీసీ వర్కింగ్ అధ్యక్షుడు, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ ధ్వజమెత్తారు. గాంధీనగర్ డివిజన్ వై జంక్షన్ వద్ద ముషీరాబాద్ నియోజవర్గం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం సంకల్ప్ సత్యాగ్రహదీక్షను నగర కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గుర్రం శంకర్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సూరత్ కోర్టు తీర్పు ఇచ్చి అప్పీల్ చేసుకోవడానికి 30 రోజులు గడువు ఇచ్చినా.. ఆగకుండా ఆఘమేఘాలమీద పార్లమెంట్ సభ్యత్వాన్ని కేంద్రం రద్దు చేయించిందని ఆరోపించారు. సత్యాగ్రహ దీక్షలో యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.అనిల్‌కుమార్‌యాదవ్, సీనియర్ నాయకులు పాశం అనిల్‌కుమార్‌యాదవ్, గుర్రం శంకర్, జీఎన్ కేశవ్, గుర్రం రుషికేశ్వరరావు, శ్రీనివాస్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ ఆర్.కల్పనాయాదవ్, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ, చంద్రకళ, మధుమతి, శీలం సత్యనారాయణ, కవిత, జయ, విడి కృష్ణ, అంజియాదవ్, సుబ్బారావు, వెంకటేష్, యాదగిరి, ప్రసాద్, తిరుమలరావు, సురేష్‌యాదవ్ తదితరులున్నారు.

'కేంద్ర ప్రభుత్వ పథకాలను అడ్డుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం'



బర్కత్‌పుర బీజేపీ కార్యాలయంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎస్.గౌతంరావు

కాచిగూడ: కేంద్ర ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులను రాష్ట్ర ప్రభుత్వం అడుగడుగునా అడ్డుకుంటుందని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు ఆరోపించారు. మంగళవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ద్వారా అంబర్‌పేట నుంచి ఉప్పల్ వరకు నిర్మాణమవుతున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణపు పనులకు రాష్ట్ర ప్రభుత్వం అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తోందన్నారు. ఫ్లైఓవర్ పనులు పూర్తయితే కేంద్ర ప్రభుత్వం, కేంద్రమంత్రికి పేరు వస్తుందనే ఉద్దేశంతోనే నిర్మాణ పనులు జాప్యం కావడానికి రాష్ట్ర ప్రభుత్వం కారణమవుతోందని విమర్శించారు.

- భూ సేకరణ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని 'రాష్ట్రంలో దుర్మార్గపు పాలన జరుగుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అభిప్రాయపడ్డారు. కార్పొరేటర్లు కన్నె ఉమారమేష్‌యాదవ్, అమృత, పద్మావెంకట్‌రెడ్డి, బీజేపీ నేతలు శ్యామ్‌రాజ్, కృష్ణాగౌడ్, కేశబోయిన శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల దృష్టి మరల్చేందుకే ప్రధానికి వ్యతిరేకంగా వాల్ పోస్టర్లు..

కాచిగూడ: ఏప్రిల్ 8న ప్రధాని నరేంద్ర మోదీ హైదరాబాద్ పర్యటన సందర్భంగా ప్రజల దృష్టిని మరల్చేందుకు బీఆర్‌ఎస్ నేతలు ప్రధానికి వ్యతిరేకంగా వాల్ పోస్టర్లు వేస్తూ.. ప్రచారం చేస్తున్నారని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను చూసి రాష్ట్ర ప్రభుత్వం చూసి ఓర్వలేకే ఇలాంటి చర్యలకు పాల్పడుతుందన్నారు. 'మంత్రి కేటీఆర్ అబద్ధాలు ఆడటంలో ఆయన తండ్రి సీఎం కేసీఆర్‌ను మించిపోయారని.. ట్విట్టర్‌లో అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని' మండిపడ్డారు. ఏప్రిల్ 8న ప్రధాని సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నూతన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు గౌతంరావు ప్రకటించారు.

ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలి

కవాడిగూడ: పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేసి ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు వేతనాల కోసం ఎదురు చూడాల్సిన దుస్థితి ఏర్పడటం ప్రభుత్వానికి మంచిది కాదన్నారు. ఎన్నో పథకాల కోసం వేల కోట్లు కేటాయించే ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న బిల్లుల కోసం మూడు వందల కోట్ల బిల్లులు కేటాయించకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. కేటాయించిన బడ్జెట్ ఉన్నా.. గత మూడు నెలలుగా ఎయిడెడ్ టీచర్లకు వేతనాలు ఇవ్వకపోవడం సిగ్గు చేటన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ట్రెజరీల్లో పాసై ఆర్థిక శాఖ వద్ద నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నీ ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు పూర్తి చేయాలన్నారు. యూఎస్‌పీసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు కె.జంగయ్య, అశోక్‌కుమార్, లింగారెడ్డి, అధ్యక్ష వర్గంగా వ్యవహరించగా స్టీరింగ్ కమిటీ సభ్యులు రవీందర్, పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణం చూతము రారండీ..

కాచిగూడ: శ్రీరామనవమిని పురస్కరించుకుని మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డు ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ బోర్డు చైర్మన్ వెంకట్‌రావు, మేనేజింగ్ ట్రస్టీ పాండురంగారావులు తెలిపారు. మంగళవారం కాచిగూడలోని మున్నూరుకాపు ట్రస్ట్‌బోర్డు కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. 30న గురువారం సాయంత్రం 6 గంటలకు సీతారాముల కల్యాణం ప్రారంభమవుతుందని ఈ వేడుకలకు కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, మాజీ ఎంపీ వీ.హనుమంతరావు, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్‌లు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ పసుపులేటి హనుమంతరావుకు అభినందన సత్కారం ఉంటుందని ప్రకటించారు. ట్రస్ట్ బోర్డు సభ్యులు మంద సూర్యప్రకాష్, శ్రీనివాస్‌రావు, నిమ్మ శంకర్, రాఘవేందర్ తదితరులున్నారు.

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాగ్‌లింగంపల్లిలోని సాయిబాబా దేవాలయంలో ఈ నెల 30న ఉదయం 10.30 గంటలకు సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు, వైస్ చైర్మన్ గంగారెడ్డి, ఆలయ ప్రధాన కార్యదర్శి ధర్మరాజుగౌడ్‌లు తెలిపారు. ఉదయం 5.30 గంటలకు సుప్రభాతసేవ, తీర్థం, అభిషేకం, అలంకారం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం సీతారామచంద్రస్వామి కల్యాణం, ఆరగింపు, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ అనంతరం అన్నదానం ఉంటుందన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

ముషీరాబాద్: రాంనగర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 30న రాంనగర్ సెయింట్ పాయిస్ స్కూల్ సమీపంలో సీతారాముల కల్యాణ మహోత్సవం ఉదయం 10.30 గంటలకు జరుగుతుందని సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెన్నిశెట్టి సుధాకర్‌గుప్తా, నేతి సత్యనారాయణ, కోశాధికారి ఎర్రం శ్రీనివాస్, ప్రోగ్రామ్ కమిటీ చైర్మన్ బుక్కా రమేష్, పులిగిల్ల కృష్ణమూర్తిలు తెలిపారు. మంగళవారం రాంనగర్‌లో వారు మాట్లాడుతూ.. ఈ కల్యాణ మహోత్సవంలో రాంనగర్ ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.